సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 25 । అక్టోబర్ । 2023



అమ్మా.. మా కోట మైసమ్మా!

కారేపల్లి మండలం ఉసిరికాయపల్లిలో ఐదు రోజుల పాటు జరిగే కోటమైసమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా మొదలైంది. 10లో



మర్లపాడులో ఆయిల్‌పామ్..

రైతుల ఇబ్బందులు తీర్చేలా అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆధ్వర్యాన మర్లపాడులో గెలల సేకరణ కేంద్రం ఏర్పాటుచేశారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 19°

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. రాత్రి వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో ఘనంగా పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచ : మండలంలోని శ్రీనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం దసరా సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. వసుంధర జ్యూయెలరీ ప్రొప్రైటర్ సంకా వెంకట రామారావు, రమాదేవి దంపతులు బహూకరించిన వెండి, బంగారంతో నేసిన చీరలో అమ్మవారు దర్శనమిచ్చారు. అర్చకులు పూర్ణహుతి కార్యక్రమాన్ని నిర్వహించిన తర్వాత జమ్మి చెట్టు వద్ద శమీ పూజలు చేశారు. కాగా, అమ్మవారు మంగళవారం శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేశారు. కార్యక్రమంలో ఈఓ రజనీకుమారి, ఆలయ చైర్మన్ మహిపతి రామలింగం తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళం



దాతకు రశీదు ఇస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్న దాన కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన యశోదమ్మ రూ.2 లక్షలు మంగళవారం విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా ఆమెకు ఆలయ ఈఓ రమాదేవి రశీదు ఇవ్వగా, దాత కుటుంబీకులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ప్రచార రథాలు సిద్ధం



సుజాతనగర్‌కు చేరుకున్న ప్రచార రథం

సుజాతనగర్: వచ్చేనెల 30న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యాన కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు సంబంధించి ప్రచార రథాలు సిద్ధమయ్యాయి. సీఎం కేసీఆర్, కేటీఆర్, వనమా ఫొటోలతో పాటు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గణాంకాలను ప్రచార రథాలపై పొందుపరిచారు. హైదరాబాద్‌లో ఈ వాహనాలను సిద్ధం చేయించగా మంగళవారం సుజాతనగర్ మండలానికి రెండు వచ్చాయి.

ఆలయ నిర్మాణానికి రూ.5లక్షల వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంటలో నూతనంగా చేపట్టిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఐలు జాలె సుధాకర్‌రెడ్డి, జాలె దయాకర్‌రెడ్డి రూ.5 లక్షలు వితరణగా అందజేశారు. ఆలయంలో ఉత్సవ విగ్రహాలు, నవ గ్రహాలు, ధ్వజస్తంభం ఏర్పాటుకు ఈ నిధులను వెచ్చించాలని ఆలయ కమిటీని కోరారు. తండ్రి జాలె నరసింహారెడ్డి జ్ఞాపకార్థం తల్లి నర్సమ్మ చేతుల మీదుగా కమిటీ సభ్యులకు ఈ మేరకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్, జాలె రామకృష్ణారెడ్డి, మన్మథరెడ్డి, వెంకటరెడ్డి, భిక్షంరెడ్డి, ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిలోని అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మంమయూరిసెంటర్: విజయదశమి పండుగ సందర్భంగా ఏపీలోని విజయవాడలో కనకదుర్గ అమ్మవారిని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రిపై రాజరాజేశ్వరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని ఎంపీతో పాటు ఆయన సతీమణి విజయలక్ష్మి, కుమార్తె డాక్టర్ గంగాభవాని దర్శించుకోగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందజేశారు. ఆతర్వాత ఎంపీ రవిచంద్ర కుటుంబ సభ్యులతో కలిసి అల్లూరి సీతారామరాజు జిల్లా చింతలపూడి సమీపంలోని ప్రగడవరం శివాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు.

దసరా వేడుక.. వివాదానికి వేదిక

ఇల్లెందులో రసాభాసగా మారిన ఉత్సవాలు

- వేదికపై గులాబీ నేతల మధ్య ఆధిపత్య పోరు
- డీవీ – దిండిగాల మధ్య మాటల యుద్ధం
- 'గులాబీ' పోరుతో కార్యక్రమానికి అంతరాయం



దసరా ఉత్సవాల వేదికపై ఎమ్మెల్యే హరిప్రియ, పక్కన డీవీ తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ప్రజలు జరుపుకునే అతి పెద్ద పండుగ విజయదశమి. అయితే ఈసారి దసరా వేడుకలు భారత రాష్ట్ర సమితి పార్టీ నేతల మధ్య నెలకొన్న విబేధాలకు వేదికగా మారడం చర్చనీయాంశమైంది.

రాష్ట్రంలోనే ప్రత్యేకం..

దసరా పండుగ వేడుకల్లో ఇల్లెందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంది. శమీ పూజ సందర్భంగా ఇక్కడ మైసూర్ స్థాయిలో ఉత్సవాలు నిర్వహిస్తారని ప్రతీతి. అటు కోటమైసమ్మ జారత, ఇటు దసరా వేడుకలు చూసేందుకు భద్రాద్రితో పాటు ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ప్రజలు కూడా ఇక్కడికి వస్తుంటారు. నవరాత్రుల సందర్భంగా పట్టణంలో నెలకొల్పిన దుర్గాదేవి, ఇతర దేవుళ్ల విగ్రహాలను ఒక చోటుకు తీసుకొస్తారు. అక్కడికే పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలంతా చేరుకుని దసరా మైదానంలో శమీ పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రజలను ఆకట్టుకునేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పాటలు, డాన్స్ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. అయితే గతానికి భిన్నంగా ఈసారి దసరా ఉత్సవాలను విజయవంతం చేయ డం కంటే తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకే బీఆర్‌ఎస్ నేతలు పోటీపడటం విమర్శలకు దారితీసింది.

భగ్గుమన్న అసమ్మతి..

ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియా నాయక్‌కు వ్యతిరేకంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు గ్రూపు కట్టారు. హరిప్రియకు టికెట్ ఇవ్వొద్దని, ఆ తర్వాత బీ ఫామ్ ఇవ్వొద్దని అధిష్టానాన్ని కోరారు. అయితే ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం విన్నపాలను ఆలకిస్తూనే ఈసారి హరిప్రియ గెలుపు కోసం అంతా కలిసి పని చేయాలంటూ పార్టీ పెద్దలు సూచించారు. దీంతో పార్టీలో అసమ్మతి, అసంతృప్త నేతలు మెత్తబడ్డారనే భావన నెలకొంది. ఇల్లెందు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కూడా ఇక్కడ అసమ్మతిని చల్లార్చేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. కానీ వివాదాలు మళ్లీ మొదటికొచ్చి దసరా వేడుక వేదికగా మరోసారి భగ్గుమన్నాయి.

నిరాశకు గురైన ప్రజలు..

బీఆర్‌ఎస్ నేతల మధ్య వర్గపోరు కారణంగా సాంస్కృతిక కార్యక్రమాలు దాదాపు అరగంట పాటు నిలిచిపోయాయి. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు ఉత్సవాలను నిలిపేయడంతో విసుగు చెందిన ప్రజలు నిరాశతో వేడుకలు జరిగే మైదానం నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో దసరా వేడుకల నిర్వహణకు ఏర్పాటు చేసిన జేకే స్కూల్ గ్రౌండ్ చుట్టూ గందరగోళ వాతావరణం నెలకొంది. మెయిన్‌రోడ్డుపై గంట పాటు ట్రాఫిక్ జామ్ అయింది. కొంత మంది పిల్లలు తప్పిపోయారు. పండగ రోజున రథాలపై వచ్చిన దేవుడి విగ్రహాలను దర్శించుకోవడం, శమీ పూజలు చేయడం, ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలతో పిల్లాపాపలతో ఉత్సాహంగా గడుపుదామని వచ్చిన తమకు బీఆర్‌ఎస్ నేతల ఆధిపత్య ప్రదర్శన ఇబ్బందిగా మారిందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఇదేం రాజకీయం..?

ప్రజలందరి వేడుకను తమ రాజకీయాలకు వేదికగా చేసుకోవడం, నాయకులు వాగ్వాదానికి దిగడాన్ని అక్కడికి వచ్చిన వారు తప్పు పట్టారు. పండుగలో రాజకీయాలు చేయడం సరికాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది. పైగా దసరా వేడుక ప్రసంగంలో ధార్మిక విషయాలను ప్రస్తావించకుండా రాబోయే ఎన్నికల్లో తమనే గెలిపించాలంటూ గులాబీ నేతలు కోరడం వివాదాస్పదంగా మారింది.

డీవీ వర్సెస్ దిండిగాల..

దసరా ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన వేదిక దగ్గరకు చేరుకున్న ఎమ్మెల్యే హరిప్రియకు డీవీ స్వాగతం పలికారు. ఆ తర్వాత మున్సిపాలిటీలో ఉన్న ఒక్కో కౌన్సిలర్‌ను వేదికపైకి పిలిచి ప్రజలకు పరిచయం చేయడం ప్రారంభించారు. ఇది సుదీర్ఘంగా కొనసాగడంతో ఎమ్మెల్యే హరిప్రియ వర్గం నేతగా ఉన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. 'దసరా వేడుకల్లో నీ పెత్తనం ఏంటి, కార్యక్రమాన్ని మొత్తం నువ్వే హైజాక్ చేస్తున్నావ్' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దిండిగాల – డీవీ మధ్య మాటల యుద్ధం కొనసాగి, చివరకు వేదిక పైనే గులాబీ నేతల మధ్య తోపులాటకు దారి తీసింది. వేడుకకు వచ్చిన ప్రజలందరి ముందు చైర్మన్ డీవీకి అవమానం జరిగిందంటూ కౌన్సిలర్లు వేదిక దిగి కిందికి వెళ్లిపోయారు.



వాదులాడుతున్న డీవీ, దిండిగాల రాజేందర్



చిత్రకూట మండపంలో స్వామి వారికి పట్టాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీరామ లీల

భద్రగిరిలో రామయ్యకు వైభవంగా విజయోత్సవం

- కమనీయంగా శమీ, ఆయుధ పూజలు
- ముగిసిన శ్రీరామ పారాయణోత్సవం
- శబరి స్మృతియాత్రకు ఏర్పాట్లు

భద్రాచలం: విజయదశమి సందర్భంగా జగదభిరాముడికి భక్తుల శ్రీరామ నామస్మరణల నడుమ అంగరంగ వైభవోపేతంగా విజయోత్సవం నిర్వహించారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో జరగుతున్న శ్రీదేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం దసరా మండపంలో విజయదశమి వేడుకలు జరిపారు. భక్త రామదాసు చేయించిన ఆభరణాలు ధరించిన శ్రీసీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్రమూర్తిని మంగళవాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పల్లకీ సేవగా దసరా మండపానికి తీసుకొచ్చారు. శ్రీరామదాసు నిర్మించిన దసరా మండపం వద్ద ఈ వేడుకలను జరపడం ఆనవాయితీగా వస్తోంది. వేడుకల్లో భాగంగా జమ్మిచెట్టు వద్ద ఆలయ అర్చకులు పుణ్యావాచనం, శమీ పూజలు చేశారు. స్వామి వారి ఆయుధాలకు ఆయుధ పూజ చేశారు. చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అని, రావణాసురుడి చెర నుంచి ప్రజలను కాపాడిన రాముడి విజయమని అర్చకులు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం రావణాసుర వధ గావించే శ్రీరామ లీలా మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరిపించారు. రావణాసురుడిపై బాణం వదలగా మిరుమిట్లు గొలిపే బాణసంచా కాంతులతో దసరా మండప ప్రాంగణం మెరిసిపోయింది. ఈ సమయంలో భక్తులు చేసిన శ్రీరామనామస్మరణలు, జయ జయ ధ్వానాలతో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంది. పూజల అనంతరం భక్తులు జమ్మిచెట్టు ఆకులను తలపై ఉంచి, తర్వాత భద్రంగా దాచుకున్నారు.

ముగిసిన శ్రీరామ పారాయణోత్సవాలు

విజయదశమిని పురస్కరించుకుని రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో నిర్వహిస్తున్న శ్రీరామ పారాయణోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపులో భాగంగా సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామివారికి పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. సంక్షేప రామాయణ హవనానికి పూర్ణాహుతితో ముగింపు పలికారు. ఈ పూజలలో ఈఓ రమాదేవితో పాటు ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

28న సాయంత్రం ఆలయం మూసివేత

ఈ నెల 28న శబరిస్మృతి యాత్రను జరిపేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 27, 28 తేదీల్లో వినాయకపురం, వీఆర్‌పురం, చర్ల, శ్రీరామగిరి ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా గిరిజనులను భద్రాచలం తీసుకొచ్చి వారికి వసతి, భోజన సదుపాయాలను కల్పించి వేడుకల్లో భాగస్వాములను చేస్తామని ఈఓ రమాదేవి తెలిపారు. 28వ తేదీన పాక్షిక చంద్రగ్రహణం ఉన్నందున సాయంత్రం 5 గంటలకే ఆలయం తలుపులు మూసివేస్తామని, 29వ తేదీ తెల్లవారుజామున ఆలయ సంప్రోక్షణ అనంతరం యథావిధిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని పేర్కొన్నారు.



శ్రీరామ లీలా మహోత్సవంలో రావణుడి ప్రతిమకు బాణం వేస్తున్న ఈఓ రమాదేవి



దహనమవుతున్న రావణాసురుడి బొమ్మ

విద్యాప్రమాణాల పెంపునకు
హెచ్‌ఎంలు పాటుపడాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, విద్యాప్రమాణాల పెంపునకు ప్రధానోపాధ్యాయులు పాటుపడాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సూచించారు. కొత్తగూడెంలోని టీచర్స్ భవన్ టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్ సింగ్ అధ్యక్షతన ఇటీవల ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన వారి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ చాలాకాలం తర్వాత ప్రధానోపాధ్యాయుల పోస్టులు భర్తీ అయ్యాయని తెలిపారు. ఈమేరకు హెచ్‌ఎంలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంపుతో పాటు విద్యాప్రమాణాల పెంపునకు పాటుపడుతూ ప్రభుత్వ విద్యారంగం వైపు ప్రజలు మరలేలా కృషి చేయాలన్నారు. అలాగే, విద్యాశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తే ఎస్జీటీలు, పండిట్ల పదోన్నతులు, బదిలీలు కూడా పూర్తయ్యేవని తెలిపారు. ఇకనైనా ఎన్‌సీటీఈ నుంచి టెట్‌కు మినహాయింపు తీసుకుని ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. అనంతరం టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఏకపక్షంగా పీఆర్‌సీ కమిటీ వేయడమే కాక ఐదు శాతం ఐఆర్ ప్రకటించడం సరికాదన్నారు. అలాగే, పెండింగ్ డీఏలు విడుదల చేయకపోగా, సీపీఎస్ రద్దుపై దృష్టి సారించలకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు జి.నాగమణి, బి.రాజుతో పాటు వి.వరలక్ష్మి, బి.మురళీమోహన్, ఎస్.వెంకటేశ్వర్లు, ఎం.పద్మరాణి, ఎం.వెంకటేశ్వర్లు, హతీరాం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభాస్థలి పరిశీలన

కూసుమంచి: ఎన్నికల ప్రచారంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో ఈనెల 27న జరిగే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జీళ్లచెరువులో 25 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఇక్కడ జరుగుతున్న పనులను ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. సభావేదిక, పార్కింగ్, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించి సూచనలు చేయడమే కాక అధికారులతో చర్చించారు.

చేజారిన ఎన్‌ఎండీసీ సీఎండీ పదవి

- ప్రస్తుత అధికారికే ఏడాది పదవీకాలం పొడిగింపు
- ఈ ఏడాది మార్చిలో సింగరేణి సీఎండీ శ్రీధర్ పేరు సిఫారసు

సింగరేణి(కొత్తగూడెం): దేశంలో ప్రతిష్టాత్మకమైన సంస్థ నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) సీఎండీ అమితవ ముఖర్జీ పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు(2024 నవంబర్ 19వరకు) పొడిగించారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు వెలువరించింది. దీంతో ఎన్‌ఎండీసీ సీఎండీగా సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్‌కు అవకాశం చేజారినట్లయింది. మార్చి 2023లో ఎన్‌ఎండీసీ సీఎండీ పదవికి శ్రీధర్‌ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రెనింగ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్(పీఈఎస్‌బీ) సిఫారసు చేసింది. అయితే, ఒక కేసుకు సంబంధించి విజిలెన్స్ క్లియరెన్స్ రాకపోవడంతో ఆయన నియామక ఉత్తర్వులు విడుదల కాలేదని తెలిసింది.

2015నుంచి సీఎండీగా...

తెలంగాణ ఏర్పడ్డాక 2015 జనవరి 5న సింగరేణి సీఎండీగా ఎన్.శ్రీధర్ బాధ్యతలు చేపట్టారు. అయితే, ఆయన రాష్ట్రప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారంటూ మార్చాలని కేంద్రప్రభుత్వం సూచించినా, సింగరేణిలో తమకు 51 శాతం ఉన్నందున సీఎండీగా శ్రీధర్‌ను కొనసాగించాలని తాము నిర్ణయించినట్లు రాష్ట్రప్రభుత్వం లేఖ రాసినట్లు తెలిసింది. అంతేకాక సింగరేణి సంస్థకు ఆయన సేవలు అవసరమున్నందున శ్రీధర్‌నే కొనసాగించాలనే భావనతో ఉన్నట్లు సమాచారం. కాగా, సింగరేణి చరిత్రలో సుదీర్ఘకాలంగా సీఎండీగా వ్యవహరిస్తున్న శ్రీధర్‌ను ఎన్‌ఎండీసీ సీఎండీగా సిఫారసు చేసి ఏడు నెలలైనా పదవి చేపట్టలేకపోయారు. కేంద్రప్రభుత్వ విధానపరమైన గనుల వేలం ప్రక్రియకు వ్యతిరేకంగా ఆయన వ్యవహరించారనే ఓ ఎంపీ కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ అంశం కూడా శ్రీధర్‌కు పదవి దక్కకపోవడానికి ఇంకో కారణంగా ప్రచారం జరుగుతోంది.

కానిస్టేబుల్ వైద్యపరీక్షలు వాయిదా

ఖమ్మంక్రైం: పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నుంచి ఖమ్మం జిల్లాలో వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే, రాష్ట్ర పోలీస్ నియామక మండలి సూచనల మేరకు ఈ ప్రక్రియను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని ఆయన సూచించారు.

పంటలకు కష్ట 'కాలం'

- ఎండల తీవ్రతకు వడబడుతున్న పైర్లు
- కాపు దశలో బెట్టకు వచ్చి దెబ్బతింటున్న పత్తిచేలు
- పొట్టదశలో నీరందక ఎండుతున్న వరి పొలాలు
- చినుకు కోసం రైతుల ఎదురుచూపులు



ఎండలకు వడబడుతున్న పత్తిచేను

బూర్గంపాడు: పంటలకు కష్టకాలం వచ్చింది. నెల రోజులుగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరగడంతో పత్తి, మిరప తదితర తోటలు వడబడుతున్నాయి. ఈ నెలలో ఇప్పటివరకు చినుకు పడకపోవడం పంటలకు ప్రతికూలంగా మారింది. బెట్టకు వచ్చిన పంటచేలను చూసి రైతులు కుమిలిపోతున్నారు. వాన పడకపోతుందా అనే ఆశతో ఉన్న వారికి నిరాశే మిగిలింది. ఎండలకు పత్తిచేలు వాడిపోయాయి. పొట్టకు వస్తున్న దశలో నీరందక వరి పొలాలు నెర్రెలు వారుతున్నాయి.

ఈ ఏడాది జిల్లాలో సుమారు 1.95 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. జూన్‌లో ఆశాజనకంగా ఆరంభమైన పత్తి పంటలకు జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన అధిక వర్షాలు, వరదలతో కొంతమేర పంటలకు నష్టం వాటిల్లింది. ఈ ఇబ్బందులను తట్టుకుని పత్తిని కాపాడుకునేందుకు అధిక పెట్టుబడులు పెట్టారు. సెప్టెంబర్ నెలలో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో ఈ పంటకు కొంత సానుకూల వాతావరణం ఏర్పడింది. కొన్ని చోట్ల పత్తిచేలు పెరిగి పూతకు వచ్చాయి. రైతులు చేలకు రెండు దఫాలుగా ఎరువులు వేశారు. పూర్తిస్థాయిలో సస్య రక్షణ చర్యలు చేపట్టారు. దీంతో కాత దశకు కూడా చేరాయి. అయితే అక్టోబర్‌లో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఎక్కడా చినుకు జాడే లేదు. దీంతో పూత, కాత దశలో ఉన్న చేలకు పదును అందక ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో పత్తి పంటను పూర్తిస్థాయిలో వర్షాధారంగానే రైతులు సాగుచేస్తున్నారు. సుమారు నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో చేలు బెట్టకు వచ్చి పూత, పిందె రాలిపోతున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో ప్రతికూల వాతావరణ పరిస్థితులు రైతులను కలవరపెడుతున్నాయి. ఎకరానికి కనీసం నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చేలా లేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రతకు తోడు చీడపీడలు, లద్దెపురుగు, పచ్చ పురుగు, తెల్లదోమ, పచ్చదోమ పంటలను ఎక్కువగా ఆశించి నష్టపరుస్తున్నాయి.



నీరు అందక ఎర్రబడుతున్న వరి

వరిదీ అదే పరిస్థితి..

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.45 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. వర్షాధారంగా, చిన్న చెరువులు, కుంటల కింద సాగు చేసిన పంటలకు ప్రస్తుతం నీరందడం లేదు. చాలాచోట్ల వరి పొట్ట దశలో ఉండగా ఈ తరుణంలోనే నీరు ఎక్కువగా అవసరం. సుమారు నెల రోజులుగా వర్షం లేకపోవటంతో పాటుగా ఎండలు మండిపోతుండటంతో వరి పొలాలు నెర్రెలు వారుతున్నాయి. ఈ ఏడాది భిన్నమైన వాతావరణ పరిస్థితులతో వరి పంటను ఆకుచుట్ట పురుగు ఆశించి రైతులను తీవ్రంగా నష్టపరుస్తోంది. ఏటా రెండు, మూడు సార్లు సస్యరక్షణ చర్యలు చేపట్టే రైతులు ఈ ఏడాది ఇప్పటికే నాలుగు సార్లు మందులు పిచికారీ చేశారు. అయినప్పటికీ వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పురుగు ఉధృతి తగ్గటం లేదని వాపోతున్నారు.

ఎదుగుదల లేని మిరప..

గతేడాది నుంచి ఇప్పటి వరకు మిర్చికి మార్కెట్‌లో మంచి ధర ఉండటంతో ఈ ఏడాది జిల్లాలో గత సంవత్సరం కంటే రెట్టింపు విస్తీర్ణంలో రైతులు మిరప సాగు చేశారు. అయితే ఎండల కారణంగా మిరప తోటలు ఆశించిన మేర ఎదగడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మిర్చి వేసిన నెల రోజులకే బొబ్బ తెగుళ్లు ఆశించి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో రైతులు ఆ పంటను తొలగించి మళ్లీ నారు కొనుగోలు చేసి సాగు చేస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా మిరప మొక్కలు సరిగా బతకడం లేదని, బతికిన మొక్కలు కూడా తొందరగా పచ్చబడడం లేదని రైతులు అంటున్నారు.

క్లుప్తంగా

ప్రతిభ చాటిన వెయిట్ లిఫ్టర్లు



పతకాలు గెలుచుకున్న క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో ఖమ్మంకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్ 59 కేజీల విభాగంలో వంశీ ప్రథమ, 74 కేజీల్లో గోపీచంద్ తృతీయ, జూనియర్స్ విభాగం 66 కేజీల కేటగిరీలో అఖిల్ ద్వితీయ, 84 కేజీల కేటగిరీలో వి.సాయికుమార్ ప్రథమ, జూనియర్స్ 74 కేజీల కేటగిరిలో వివేక్, 83 కేజీ సాయికుమార్, 66కేజీల విభాగంలో పి.పవన్ ప్రథమ స్థానం పొందారు. వీరిని క్లాసిక్ జిమ్ నిర్వాహకులతో పాటు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ బాధ్యులు సీహెచ్.మనోజ్ కుమార్చౌదరి, నగీన మనోచౌదరి అభినందించారు.

రూ.65వేలు పలికిన లడ్డూ ధర

ఏన్కూరు: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ వద్ద పూజలు అందుకున్న లడ్డూకు మంగళవారం వేలం నిర్వహించారు. అమ్మవారి ఊరేగింపులో భాగంగా ప్రధాన సెంటర్‌లో లడ్డూ పాట ఏర్పాటు చేయగా, రైతుబంధు కన్వీనర్ మేడ ధర్మారావు రూ.65,500కు దక్కించుకున్నారు. గత ఏడాది లడ్డూ ధర రూ.30 వేలే పలకగా ఈసారి రెట్టింపు కావడం విశేషం.

రూ.3.15 లక్షలు పట్టివేత

అశ్వారావుపేటరూరల్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిర్వహిస్తున్న తనిఖీల్లో ఏపీలోని జంగారెడ్డిగూడేనికి చెందిన సుధాకర్‌రెడ్డి కారులో హైదారాబాద్ వెళ్తుండగా పోలీసులు తనిఖీ చేయగా రూ.1,84,000 నగదు లభించింది. అలాగే, ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన అజయ్‌కుమార్ వద్ద రూ.71 వేల నగదును గుర్తించారు. ఈ నగదుకు సంబంధించి సదరు వ్యక్తుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరంరోడ్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు మంగళవారం రూ.60 వేలు నగదును సీజ్ చేశారు. ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేసిన సందర్భంలో అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద రూ.60 వేలు లభించగా ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు.

నాలుగు ప్రచార వాహనాలు సీజ్



వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: ఎలాంటి అనుమతి లేకుండా ఎన్నికల ప్రచారంలో వినియోగిస్తున్న నాలుగు వాహనాలను అధికారులు సీజ్ చేశారు. నేలకొండపల్లిలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ వాహనం, డీజేపీ వాహన పత్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వేణుమనోహర్ తనిఖీ చేశారు. అయితే, నాయకుల వద్ద అనుమతి పత్రాలు లేకపోవటంతో సీజ్ చేశారు. అలాగే, కాంగ్రెస్ పార్టీకి చెందిన రెండు ప్రచార వాహనాలను బైరవునిపల్లిలో సీజ్ చేసిన అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

తాగునీటి కోసం వెళ్లి.. బావిలో పడి మృతి



మృతదేహాన్ని తీసుకొస్తున్న స్థానికులు

కారేపల్లి: ప్రమాదవశాత్తు బావిలో పడిన మేకల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని విశ్వనాథపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథపల్లికి చెందిన ఏనుగు జోగయ్య(60) భార్య కమలమ్మతో కలిసి మేకలు మేపేందుకు సమీపాన చేన్ల వైపు వెళ్లారు. మధ్యాహ్న భోజనం తర్వాత జోగయ్య తాగునీటి కోసం ర్యాంప్ ఉన్న(దిగుడు ఉన్న) వ్యవసాయ బావిలోకి దిగాడు. ఈక్రమంలో జారి పడిన ఆయన నీట మునిగి మృతి చెందాడు. అయితే, జోగయ్య ఎంతకు రాకపోవటంతో కలలమ్మ సమీప రైతులకు చెప్పగా వారు బావిలో వెతికికా దొరకలేదు. చివరకు ఇల్లెందు అగ్నిమాపక శాఖ కేంద్రానికి ఫోన్ చేయగా చేరుకున్న సిబ్బంది గాలించడంతో జోగయ్య మృతదేహం లభించింది. ఆయనకు భార్య కమలమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా, కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

అమ్మా.. మా కోట మైసమ్మా!

భక్తజనంతో పోటెత్తిన శ్రీ కోటమైసమ్మ జాతర

- దసరా సందర్భంగా మొదలైన కోలాహలం



శ్రీకోటమైసమ్మ తల్లి జాతర వ్యూ

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారమై, భక్తులు కోరిన కోర్కెలు తీర్చే శ్రీకోటమైసమ్మ తల్లి జాతర మొదలైంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో జాతర ప్రాంగణం పోటెత్తింది. అమ్మా మైసమ్మా.. మా కోట మైసమ్మా... అంటూ బారులుదీరి తల్లిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.

భారీగా భక్తజనం

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం – భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణానికి సరిహద్దులో ఉన్న ఉసిరికాయపల్లి గ్రామంలో కొలువు దీరిన శ్రీకోటమైసమ్మ తల్లి జాతర దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మొదలుకాగా ఐదు రోజుల పాటు జరగనుంది. సోమవారం రోజు అంతంత భక్తుల తాకిడి కాస్త తక్కువగానే ఉన్న మంగళవారం మాత్రం వేలాదిగా తరలివచ్చారు. కారేపల్లి, కామేపల్లి మండలాలతో పాటు సరిహద్దు జిల్లాలైన భద్రాద్రి జిల్లా ఇల్లెందు, టేకులపల్లి, మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాల నుంచి భక్తులు వచ్చి తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కాగా, ఉసిరికాయపల్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రభబండ్లతో ఒక రోజు ముందుగానే చేరుకుని బస చేశారు. ఇక జాతరలో ఏర్పాటు చేసిన సోలాపూర్ వారి సర్కస్, జెయింట్ వీల్స్ వద్ద చిన్నాపెద్ద తేడా లేకుండా ఆనందంతో గడిపారు.



కోటమైసమ్మ దర్శనానికి క్యూ కట్టిన భక్తులు



వాహన పూజ చేస్తున్న అర్చకుడు

దేవాదాయ శాఖ, ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాట్లు

జాతరకు వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభి రామారావు ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, కారేపల్లి, కామేపల్లి ఎస్‌ఐలు పుష్పాల రామారావు, ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

మర్లపాడులో ఆయిల్‌పామ్ కలెక్షన్ సెంటర్

వేంసూరు: వేంసూరు మండలంలోని మర్లపాడులో తెలంగాణ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యాన ఆయిల్‌పామ్ గెలల కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. గ్రామంలోని శ్రీ శ్రీనివాస వే బ్రిడ్జిలో ఈ సెంటర్‌ను ఆయిల్‌ఫెడ్ డివిజన్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. మర్లపాడులోని సెంటర్ ద్వారా ప్రతీ సోమవారం ఆయిల్‌పామ్ గెలలు సేకరించి అశ్వారావుపేటలోని ఫ్యాక్టరీకి తరలిస్తామని తెలిపారు. రైతులకు దూరాభారం తప్పించేలా ఏర్పాటుచేసిన ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ జి.కళ్యాణ్‌గౌడ్, జిల్లా మేనేజర్ జేవీఎస్‌డీ.భారతి, ఫీల్డ్ ఆఫీసర్లు కృష్ణారావు, నవ్య, నాగలక్ష్మీతోపాటు బండి గురవారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, గండ్ర సోమిరెడ్డి, కూరపాటి శ్రీనివాసరావు, మందపాటి కేశవరెడ్డి, సరోత్తమరెడ్డి, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సెంటర్‌లో ఆయిల్‌ఫెడ్ డీఓ, తదితరులు

కారుకొండలో విషాదం

- 11 కేవీ విద్యుత్ వైర్లు తాకి షాక్‌తో ఒకరి దుర్మరణం
- తీగలు తొలగించాలని కోరినా పట్టించుకోని అధికారులు



విద్యుత్ షాక్‌కు గురైన సాంబ

కొత్తగూడెంరూరల్: ఇంటిపై ఉన్న11 కేవీ విద్యుత్ తీగలు తాకి షాక్‌కు గురై మృతిచెందిన ఘటన లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండలో మంగళవారం తీవ్ర విషాదం నింపింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కల్లెం సాంబశివరావు(35) ఇంటిపై 11 కేవీ వైర్లు ఉన్నాయి. వాటిని తొలగించాలని సాంబశివరావు విద్యుత్ అధికారులకు గతంలోనే పలుమార్లు ఫిర్యాదు చేశాడు. అయినా వారు పట్టించుకోలేదు. కాగా, దసరా సెలవులు కావడంతో సాంబశివరావు భార్య సరిత, కూతురు, కుమారుడితో కలిసి పుట్టింటికి వెళ్లింది. ఒంటరిగా ఉన్న సాంబశివరావు కోతుల ను తరిమి కొట్టేందుకు డాబా ఎక్కగా.. ప్రమాదవశాత్తు తీగలు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, మృతుడి బంధువులు భారీగా చేరుకుని కారుకొండ ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే సాంబశివరావు మృతి చెందాడని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలియగానే ఎస్సై సంతోష్, ట్రైనీ ఎస్సై రాజమౌళి అక్కడికి చేరుకుని విద్యుత్ అ ధికారులతో చర్చించారు. మృతుడి దహన సంస్కారా లకు తక్షణ సాయంగా రూ.25 వేలు ఇస్తామని ఏఈ రఘుహామీ ఇవ్వడంతో పోలీసులు ఆందోళన విరమింపజేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలు మృతి

మృతురాలు ఏపీ మంత్రి సురేశ్ సోదరి

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ఆదిమూలపు శైలజ (58) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆమె భర్త అబ్రహం పాల్వంచ డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తుండగా వారికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. 1998లో ఉద్యోగంలో చేరిన ఆమె టేకులపల్లి మండలంలో పలు పాఠశాలల్లో విధులు నిర్వర్తించి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా, రిసోర్స్ పర్సన్‌గా మన్ననలు పొందారు. మరో మూడేళ్లలో ఉద్యోగ విరమణ చేయనుండగా మృతి చెందారు. ఈ సందర్భంగా కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని శైలజ స్వగృహంలో మృతదేహం వద్ద ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నివాళులర్పించాక స్వగ్రామమైన ప్రకాశం జిల్లా మార్కాపురానికి మంగళవారం తరలించారు. కాగా, శైలజ ఆంధ్రప్రదేశ్ మంత్రి ఆదిమూలపు సురేశ్‌కు స్వయానా సోదరి.



ఆదిమూలపు శైలజ (ఫైల్)

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కరకగూడెం: పురుగులమందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మంగళవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం ఇంట్లోనే పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తరలించి మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పెళ్లికావడం లేదనే మనస్తాపంతో ఆత్మహత్య

సుజాతనగర్: పెళ్లికావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సుజాతనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రంలోని ఐలయ్యకాలనీకి చెందిన నర్సింగ్ వెంకన్న పెద్ద కుమారుడు శ్రీను (33) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో చీరతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

జూలూరుపాడు: మండలానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో మోసం చేసి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై మంగళవారం స్థానిక పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పురుషోత్తం కథనం ప్రకారం.. మండలానికి చెందిన బాలికను వేమూరి కనకరాజు ప్రేమ పేరుతో కొన్ని రోజులుగా ఆమె వెంటబడుతున్నాడు. ఈ నెల 22న బాలిక సరుకుల కోసమని కిరాణా దుకాణానికి వెళ్తుండగా బలవంతంగా కనకరాజు ఇంట్లోకి లాక్కొని వెళ్లి పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు ఆలస్యంగా చెప్పడంతో వారి ఫిర్యాదు మేరకు కనకరాజుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ పురుషోత్తం వివరించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి



మనోజ్ (ఫైల్)

మణుగూరుటౌన్: మండలంలోని తోగ్గూడెం పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి మణుగూరులో సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరై తిరిగి తొగ్గూడెం వెళ్తున్న సమయంలో మనోజ్ (22) రోడ్డుపై జారి కిందపడి గాయపడ్డాడు. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. మనోజ్ మృతితో తోగ్గూడెం గ్రామంలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...



భద్రయ్య (ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. టేకులపల్లి ఎస్‌ఐ గన్‌రెడ్డి రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బొమ్మనపల్లి గ్రామానికి చెందిన ఆకుల భద్రయ్య (45) ఆదివారం రాత్రి అనిశెట్టిపల్లిలో బంధువు ఇంటికి కాలినడకన వెళ్లాడు. అదేరోజు రాత్రి 11.30 గంటల సమయంలో తిరిగి వస్తుండగా బొమ్మనపల్లి సబ్‌స్టేషన్ వద్దకు రాగానే వెనుక నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన గుర్తు తెలియని వాహనం భద్రయ్యను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం మృతుడి కుమారుడు ఆకుల సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్వరంతో పంచాయతీ కార్మికుడు...

గుండాల: వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్న పంచాయతీ కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఆళ్లపల్లి మండలం పాతూరు గ్రామానికి చెందిన గొగ్గల చలపతి (32) స్థానిక జీపీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. జ్వరం రావడంతో గత శుక్రవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆదివారం హైదరాబాద్ తీసుకెళ్తుండగా పరిస్థితి విషమించి మార్గమధ్యలో మృతి చెందాడు.

గుండెపోటుతో మధ్యప్రదేశ్ వాసి...

గుండాల: బతుకుతెరువు కోసం వలస వచ్చిన తాపీ మేస్త్రి గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మధ్యప్రదేశ్ రాష్ట్రం భారత్‌ఘట్ జిల్లాకు చెందిన తాపీ మేస్త్రి బినా రామ్ గుండాలలో కొంతకాలంగా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు..

టేకులపల్లి: పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతిచెందాడు. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని ప్రెగళ్లపాడు పంచాయతీ పడమటిగుంపునకు చెందిన జోగా జోగయ్య (70) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోదావరిలో వ్యక్తి గల్లంతు



గాలింపు చర్యలు చేపడుతున్న స్థానికులు

పినపాక: గోదావరిలో బతుకమ్మలు నిమజ్జనం చేయడానికి వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన పినపాక మండలంలోని రాయిగూడెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాయిగూడెం ఎస్సీకాలనీకి చెందిన చిట్టిమల్ల సురేశ్ సోమవారం ఉదయం బతుకమ్మలను గోదావరిలో విడిచిపెట్టడానికి వెళ్లాడు. గోదావరి ప్రవాహానికి కాలుజారి మునిగిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపివేసి, మంగళవారం గాలింపు చర్యలు ప్రారంభిస్తామని సీఐ శివప్రసాద్ తెలిపారు.

తల్లీబిడ్డల అదృశ్యంపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కొత్తపేటకాలనీకి చెందిన మహిళ ముత్యాల సాయిజ్యోతి ఈ నెల 17వ తేదీన చర్ల నుంచి వచ్చి భద్రాచలంలోని తన పుట్టింటికి వచ్చింది. సోమవారం ఆమె తన కూతురుతో కలిసి అత్తగారింటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. కానీ, ఇప్పటివరకు అత్తగారింటికి వెళ్లకపోవడంతో సాయిజ్యోతి తల్లి రమాదేవి అన్నిచోట్ల ఆచూకీ కోసం ప్రయత్నించగా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్‌ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కేసు నమోదు

దమ్మపేట: వ్యక్తిని అసభ్య పదజాలంతో దూషించడమే గాక, నెట్టివేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం రాత్రి మండలంలోని మందలపల్లి గ్రామం, ప్రకాష్‌నగర్‌కాలనీకి చెందిన వెలివల వెంకటముత్యం.. అదే గ్రామానికి చెందిన యార్లగడ్డ వినేశ్ బైక్‌పై కాలు పెట్టాడు. గమనించిన వినేశ్.. వెంకటముత్యంను అసభ్య పదజాలంతో దూషిస్తూ, నెట్టివేశాడు. వెంకటముత్యం కింపడిపోగా, అతడి కన్ను, పెదవులకు గాయాలయ్యాయి. బాధితుడి కుమార్తె ముత్యాల వెంకటేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఆలయానికి రూ.3 లక్షల విలువైన శ్రీరామరథం



శ్రీనివాసాచారి బహూకరించిన రథంతో భక్తులు

తల్లాడ: తల్లాడ మండలం రామానుజవరం గ్రామానికి చెందిన చిట్యాల శ్రీనివాసాచారి రాముడిపై ఉన్న అంచంచల భక్తితో శ్రీరామరథాన్ని సొంతంగా తయారుచేశారు. గ్రామంలోని కోదండ రామాలయంలో ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లేందుకు గాను ఆయన రెండు నెలల పాటు శ్రమించి రథాన్ని సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.3 లక్షల విలువైన టేకు చెక్క ఉపయోగించినట్లు తెలిపారు. ఈమేరకు రథాన్ని ఆలయ కమిటీకి మంగళవారం అప్పగించగా శ్రీనివాసచారి – సావిత్రి దంపతులను బాధ్యులు సన్మానించాక శ్రీరామరథంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

మద్యం మత్తులో లారీ నడిపిన క్లీనర్



లారీ క్లీనర్‌తో స్థానికులు, పోలీసులు

కారేపల్లి: మద్యం మత్తులో క్లీనర్ లారీని నడిపి ఓ వ్యక్తికి ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. మండలంలోని భాగ్యనగర్‌తండా మీదుగా మంగళవారం అతిగా మద్యం సేవించిన క్లీనర్ లారీ నడుపుతూ వెళ్తున్నాడు. ఈక్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కొత్తూరుతండాకు చెందిన గుగులోతు రమేష్‌ను భాగ్యనగర్‌తండా సర్కిల్‌లో ఢీకొట్టాడు. ఈ ఘటనలో రమేష్ తలకు గాయం కాగా, క్లీనర్ అలాగే ఇల్లెందు వైపు వెళ్లిపోయాడు. దీంతో స్థానికులతో పాటు కానిస్టేబుల్ సీతారాములు, హోంగార్డు శంకర్ లారీని వెంబడించి ఆలియాతండా వద్ద అడ్డుకున్నారు. ఈక్రమంలో లారీ క్లీనర్‌కు దేహశుద్ధి చేయగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

టీఎన్జీవోస్ కార్యవర్గంలో పలువురికి స్థానం



నియమితులైన వారిని సన్మానిస్తున్న అఫ్జల్‌హసన్

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా కార్యవర్గంలో పలువురికి స్థానం కల్పించారు. ఖమంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ యూనిట్ కార్యదర్శి ఆర్‌ఐ కేవీవీ.ప్రసాద్‌ను నియమించినట్లు తెలిపారు. అలాగే, టౌన్ ఉపాధ్యక్షుడిగా బి.రజినీకాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అన్వర్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా వసంత, టౌన్ సంయుక్త కార్యదర్శిగా ఝాన్సీ, జిల్లా కార్యాలయ కార్యదర్శిగా పురుషోత్తమరెడ్డి, క్రీడా కార్యదర్శిగా వజీరుద్దీన్, జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా ఎ.జ్యోతి, జిల్లా పబ్లిసిటీ కార్యదర్శిగా వై.శ్రీనివాసరావును నియమించామని వెల్ల డించారు. ఈసమావేశంలో నాయకులు నందగిరి శ్రీను, జీ.ఎస్.ప్రసాద్‌రావు, భాగం పవన్, చంద్రశేఖర్‌రావు, శాబాసు జ్యోతి, నాగుల్‌మీరా, సాయి శిరణ్మయి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● లండన్‌లో బతుకమ్మ !



లండన్‌లో స్థిరపడిన తెలంగాణ వాసులు సంప్రదాయాలను మరిచిపోకుండా ఘనంగా బతుకమ్మ జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మధిరకు చెందిన చల్లా అనూష తదితరులు పాల్గొన్నారు. – మధిర

కోడి పందేల స్థావరాలపై దాడులు

ములకలపల్లి: గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కొత్తూరు గ్రామశివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో దాడులు నిర్వహించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.10,620 నగదుతో పాటు రెండు కోడి పుంజులు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దురదపాడు సమీపంలో...

అశ్వారావుపేటరూరల్: దసరా పండుగ నేపథ్యంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై మంశవారం పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్‌ఐ పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని దురదపాడు సమీపంలోని అటవీ ప్రాంతంలో కోడి పందేలు నిర్వహిస్తుండగా, సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు పందెం కోడి పుంజులు, రూ.3,550 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పేకాట స్థావరంపై దాడి

చుంచుపల్లి: విద్యానగర్‌కాలనీలో సోమవారం రహస్యంగా పేకాట ఆడుతున్న వారిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. చుంచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కొందరు అటవీశాఖ సిబ్బంది, వ్యాపారులు కలిసి పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.82 వేల నగదుతో పాటు సెల్‌ఫోన్‌లను చుంచుపల్లి పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.